క్లుప్తంగా

నేటి నుంచి సాతులూరులో దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువై యున్న పోలేరమ్మ, మునిబందమ్మ, వినుకొండ అంకమ్మ, ఊర అంకమ్మ, మహాలక్ష్మమ్మ, నాభిశిల దేవాలయాల తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకూ ఘటం కుండ ఊరేగింపు, 5వ తేదీన వసంతోత్సవం, 6వ తేదీన పొంగళ్లు, వడపప్పు, మధ్యాహ్నం అన్నదానం, 7న అమ్మవార్లకు మొక్కుబడులు చెల్లింపు, 8న సిడిమానోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైస్కూలుకు క్రీడా సామగ్రి అందజేత



నాదెండ్ల: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సాతులూరు కెనరా బ్యాంక్ అధికారులు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.65 లక్షల విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ, ప్రతి ఏడాది బ్యాంక్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోవటమే కాక, క్రీడల్లో కూడా రాణించి ఉజ్వల భవితను సాకారం చేసుకోవాలన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ ఉమామహేశ్వరరావును హెచ్ఎం వి.వెంకటరావు, పీడీ కె.అంజమ్మ, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ



రొంపిచర్ల: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో నరసరావుపేట డీఎస్పీ కె.వి. మహేష్ మంగళవారం పర్యటించారు. రొంపిచర్ల, గోగులపాడు, అలవాల గ్రామాల్లో పర్యటించి, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులు, పరిసరాలను కూడా ఆయన పరిశీలించారు. రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలను ఎస్ఐ కె.పి. రవీంద్రకు సూచించారు. అలాగే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన ప్రాంతాలను, అక్కడ పరిసరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో మంచి ఉపాధి అవకాశాలు



నాదెండ్ల: వృత్తి విద్యా కోర్సుల అభ్యాసంతో భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ప్రిన్సిపల్ మాధవీలత చెప్పారు. నాదెండ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 9,10, ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా తిమ్మాపురంలోని వసంత టెక్స్‌టైల్స్ మిల్లులో ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఇండస్ట్రీలో యంత్రాలు పనిచేసే విధానం, పత్తి నుంచి దుస్తుల తయారీ వరకూ ప్రక్రియను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు గురించి మిల్లులో పనిచేసే నిపుణుల గురించి తెలుసుకుని యంత్రాల పనితీరును జనరల్ మేనేజర్ హనుమంత రావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికపరంగా వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆధునిక యంత్రాలతో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాన్ని సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ కోటేశ్వరమ్మ, ఆర్ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: భవిష్యత్‌లో వృత్తి విద్యలు ఉపాధిని అందించే కోర్సులుగా మారుతాయని ఒకేషనల్ ఉపాధ్యాయులు గొలపల్లి రాఘవేంద్రసాయి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యల పట్ల మంగళవారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్ కోసం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యార్థులను తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఒకేషనల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ప్రతిభ పోటీలు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామ్‌ఫా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ పి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు జిల్లా కలెక్టర్ శివశంకర్, డీఈఓ శామ్యూల్, సత్తెనపల్లి ఉపాధ్యాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు.



సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ కాంస్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



చిలకలూరిపేటలో గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



వినుకొండలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మహాత్మా... నిను మరువము..

- వైభవంగా జాతిపితకు నివాళి
- వాడవాడలా వర్ధంతి నిర్వహణ
- గాంధీజీ సేవలను కొనియాడిన నేతలు

నరసరావుపేట: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడిన ప్రతినిధులు గాంధీ దేశ స్వాతంత్రం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు చిన్ని వెంకట శ్రీనివాసరావు, ఛాంబర్ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, కోటప్పకొండ సత్రం కమిటీ చైర్మన్ ప్రవల్లిక సత్యం, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి నిడమానూరి సురేంద్ర, సంఘ సభ్యులు కొప్పురావూరి మోహనరావు, గాదంశెట్టి రామకృష్ణ, కొత్తూరి కోటేశ్వరరావు, సురేష్‌బాబు, బత్తుల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షులు గుడివాడ చిన్నగురునాథం, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ ఆశయ సాధనకు, ఆలోచనలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, సంఘం నాయకులు ఎం.నరసింహారావు, ఎస్.లక్ష్మీనారాయణ, పుల్లారావు, జగదీష్, శ్రీనివాసరావు, పవన్ కుమార్, కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస రావు, చంద్రశేఖర్, కె.కోటేశ్వర రావు, కె.విజయ లక్ష్మి, ఈ. వెంకటేష్, కె.పవన్ పాల్గొన్నారు.



వినుకొండలో మహాత్ముడి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



గణపవరంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న హెచ్ఎం కృష్ణానాయక్

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో....

మహాత్మాగాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ అనుసరించిన అహింస మార్గాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ నాయకులు అచ్యుత మోహనరావు, పొత్తూరి రాము, రీజనల్ సెక్రటరీ చలంకూరి కోటేశ్వరరావు, బెల్లంకొండ ప్రసాద్, శ్రీనివాస్, పవన్, కృష్ణ, సువర్ణలక్ష్మి, విజయలక్ష్మి, శైలజ, అనిల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఐ.కృష్ణానాయక్, ఉపాధ్యాయులు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాదెండ్ల, సాతులూరు, గణప వరంలో ఉన్న గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ, ఆంగ్లేయులను ఎదిరించి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని అన్నారు. జాతి వివక్ష, అంటరానితనం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గాంధీ ఎనలేని పోరుసల్పారన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన

చిలకలూరిపేట: మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాత్ముడు బ్రిటిష్ వారిపై చేసిన శాంతియుత పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఆ మహనీయుని త్యాగాల వల్లనే నేడు భారతీయులందరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గాంధీజీ కలలు సాకారం చేస్తున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలవద్దకే పరిపాలన తీసుకువచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు తులాబంధుల మణిదీప్, యడ్లపాడు, గణపవరం సొసైటీల చైర్మన్లు బసల శివరామకృష్ణ, మంగు ఏడుకొండలు, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్, నాయకులు పెన్నా సాంబశివరావు, మారుబోయిన నాగరాజు, పంగులూరి వెంగళరాయుడు, గుత్తి శింగయ్య, సైదావలి పాల్గొన్నారు.

గ్రామ జలసంఘాల ద్వారా జేజేఎం పనులు

–ఏఈ ఎం.ఆకాష్

బొల్లాపల్లి: జలజీవన్ మిషన్‌లో పనులను గ్రామ జల సంఘాల ద్వారా చేపడతామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ఎం.ఆకాష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామసచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ మండలంలో రెండు విడతలుగా మంజూరయ్యాయని, మొదటి విడతలో 20 పనులకు గాను 10 పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో 54 మంజూరయ్యాయి. వీటిలో 4 పూర్తయ్యాయనీ, నాలుగు అసంపూర్తిగా ఉన్నాయని, మిగిలిన పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. మొదట, రెండో విడత కలిపి 56 పనులు గ్రామ జలసంఘాల ద్వారా పనులు చేపడతామని తెలిపారు. గ్రామసమైఖ్య సంఘాలకు చెందిన సభ్యులను గ్రూపులుగా ఏర్పాటు చేసి గ్రామ జల సంఘాల ద్వారా ఈ పనులు త్వరలో నిర్వహిస్తామని, ప్రతిపాదనలు తయారు చేసి పంపామని తెలిపారు. ఆయా పనులకు కావల్సిన మెటీరియల్స్ ప్రభుత్వం నుంచి అందుతుందన్నారు. పనులకు సిద్ధం కావల్సి ఉందని ఏఈ తెలిపారు. మండలంలో నీటి కొరత ఎదుర్కొంటున్న గ్రామాలకు ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి ఆయా గ్రామాలను గుర్తించి నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా చేస్తామన్నారు. రేమిడిచర్ల, గండిగనుముల, అయ్యన్నపాలెం, మన్నేపల్లి తండా తదితర గ్రామాల్లో నీటి సమస్య గుర్తించి త్వరలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

కొత్తలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యం.రాధాకృష్ణన్ తెలిపారు. ఈ శిబిరంలో 307 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఎముకల వైద్యాధికారి కరిముల్లా, స్త్రీ వైద్య నిపుణులు దుర్గాంబ, కంటి వైద్య నిపుణులు జానీహీరా సూపర్‌వైజరు ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సంకీర్తన పాల్గొన్నారు.

ఇరు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఇరువురు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన రావులపల్లి వీరాంజినేయులు చెందిన కంది పొలంలో అదేగ్రామానికి మందా విజయరాజు తన మేకల మేత కోసుకున్నాడు. ఈక్రమంలో తన కంది పొలంలో తనకు తెలియకుండా మేత కోయటం ఏమిటని ప్రశ్నించిన రావులపల్లి వీరాంజినేయులు, మందా విజయరాజు కుటుంబ సభ్యుల మధ్య వాదులాటతో పాటు కొట్లాట కూడా జరిగినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో విచారణ చేపట్టి ఇరు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు

రొంపిచర్ల: సమాజాన్ని కుష్ఠు వ్యాధి రహితంగా చేయడానికి మనమందరం సమిష్టి కృషితో పని చేయాలని వైద్యాధికారి డాక్టర్ ఎస్. రేవతీబాయి అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జనవరి 30వ తేదీ నుంచి జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ, కుష్ఠువ్యాధి అవగాహన కార్యక్రమాలు, సర్వే నిర్వహిస్తామన్నారు. ఎలాంటి మూఢ నమ్మకాలకు, అపోహలకు పోకుండా కుష్ఠు వ్యాధి పట్ల సమాజంలో అవగాహన కల్పించేందుకు అపోహలు తొలగించేందుకు మనమందరం కృషి చేయాల్సి ఉంటుందన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను వారు వివరించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు అన్ని గ్రామాల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు. అనుమానస్పద కుష్ఠు వ్యాధి కేసులను కనుగొని, వ్యాధి నిర్ధారణ చేసి వారికి తొలి దశలోనే చికిత్స అందజేయాలన్నారు. 15 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారన్నారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, ప్రతిజ్ఞ చేశారు.



గాంధీ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

వినుకొండ (నూజెండ్ల): ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయ కళాకారులు, నాదోపాసన ద్వారా భగవంతుడిని దర్శించిన సంగీత బ్రహ్మ శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రుల చిత్రపటం, శ్రీ త్యాగరాజస్వామి పటంతో నగర సంకీర్తన, స్వామి వారికి అభిషేకం, విశేష అర్చన నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక భజనలు, భక్తిపాటల ఆలాపన చేశారు. కార్యక్రమంలో చందలూరి సుబ్బారావు, కోటా మల్లికార్జున రావు, వీహెచ్‌పీ సభ్యులు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగ పవన్‌కుమార్, కె.సుబ్బారావు, విజి బాలరావు, గోనుగుంట్ల ఘంటారావు, బి.సాంబశివరావు, కె.భద్రయ్య, పూజారి చంటి, కోట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న వీహెచ్‌పీ సభ్యులు, భక్తులు

పేదల ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం

అమరావతి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ మేకల హనుమంత రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధరణికోట-1 సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ గంగాధర శ్రీనివాసన్, మండల వైద్యాధికారి డాక్టర్ రవిబాబు, డాక్టర్ శివరత్న కుమార్, డాక్టర్ కల్యాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, పలువురు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మొక్కజొన్నలో గులాబీ రంగు పురుగు నివారణ

రొంపిచర్ల: మొక్కజొన్న పైరును గులాబీ రంగు మొవ్వ తొలుచు పురుగు ఆశిస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. మొక్కజొన్న పైరుపై రెక్కల పురుగులు ఆకుతొడుగు మీద, ఆకు అడుగా భాగాన 80 నుంచి 100 గుడ్ల వరకు పెడతాయి. గుడ్లు పెట్టిన నాలుగైదు రోజులలోనే లార్వాలు వెలువడి మొదటిగా ఆకుమీద గోకి మొవ్వ లోపలికి వెళ్లి విప్పారిన ఆకులను తినడం ప్రారంభిస్తాయి. ఆకులు విచ్చుకోకుండా వరుసగా ఆకులపై రంధ్రాలు కనిపిస్తాయి. లార్వాలు ఎదుగుతున్న మొవ్వని తినడం వల్ల మొక్కలు 16 రోజులకే చనిపోతాయి. 20 రోజుల పైబడిన పైరుకు ఆశిస్తే గులాబీ రంగు పురుగు వల్ల 20 శాతం మీర మొక్కలు చనిపోతాయి. గులాబీ రంగు పురుగు నివారణకు మొక్కజొన్న విత్తిన 10-12 రోజుల వ్యవధిలో విధిగా ఎకరానికి 500 మిల్లీలీటర్ల క్లోరిపైరీపాస్ లేదా 60 మిల్లీలీటర్ల క్లోరాంత్రి నిలిప్రోలుని పిచికారి చేసుకోవాలన్నారు. ఆ సమయంలో మందు పిచికారీ చేయని ఎడలా మొక్కలు చనిపోవటం గమనించి వెంటనే ఎకరానికి 60 మిల్లీ లీటర్ల ట్రైసర్ లేదా 100 మిల్లీలీటర్ల డెలిగేట్ లేదా 80 గ్రాముల ప్రొక్లెయిం మందును ఏదో ఒకదానిని తీసుకొని అవసరాన్ని బట్టి ఏడు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరాకు 2 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొక్కల మొవ్వలలో వేసుకొని నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.



మొక్కజొన్న పైరు

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన గాదె వీరాంజనేయులు జనసేన పార్టీని వీడి తన అనుచర గణంతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భారీ బైక్ ర్యాలీతో అచ్చంపేట నుంచి క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి తన అనుచరులతో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, వీటన్నింటినీ చూసి టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా కార్యకర్తలు తరలి వస్తున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, మేలు జరిగిన ప్రతి కుటుంబం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, జిల్లా బీసీ కార్యదర్శి సాతర్ల శ్రీనివాసరావు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, అచ్చంపేట పార్టీ కన్వీనర్ డాక్టర్ సమరం, సొసైటీ మాజీ అధ్యక్షుడు యల్ల మందయ్య, జేసీబీ మర్రెడ్డి తదితరులు ఉన్నారు.

ముప్పాళ్ళ ఎస్సైగా హజరతయ్య బాధ్యతల స్వీకరణ



ముప్పాళ్ళ: సాధారణ బదిలీల్లో భాగంగా ముప్పాళ్ళ ఎస్సై గా పి.హజరతయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట రూరల్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ముప్పాళ్ళకు వచ్చారు. గతంలో రొంపిచర్ల మండలం ఎస్సైగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ బీ. ఆదినారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సన్మానం

సత్తెనపల్లి: 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా సత్కారం పొందిన సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.ఎం. ఇస్మాయిల్‌ను సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండం బాబూరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, ఆళ్ల జగన్నాధం, షేక్ జనమ్మ, షేక్ మస్తన్ బీ పాల్గొన్నారు.



3న సీజింగ్ వాహనాల బహిరంగ వేలం

నకరికల్లు: పలు కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఫిబ్రవరి 3న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ పైడి రాంబాబు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల పాటదారులు నకరికల్లు పోలీసు స్టేషన్ ఆవరణలోఉన్న వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చని చెప్పారు. వేలంలో పాల్గొనే ముందుగా వేలం అధికారి వద్ద రూ.2 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

జగ్గాపురంలో ఫ్యామిలీ డాక్టర్

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పిస్తోందని డాక్టర్ ఎం.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని జగ్గాపురం గ్రామంలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 30 మందికి వివిధ రకాల పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పున్నారావు, హెల్త్ సూపర్‌వైజర్ వి.రాజశేఖర్, 104 వాహనం సిబ్బంది నబి, ఆరోగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



జగ్గాపురం పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్న వైద్య బృందం



జగ్గాపురంలో రోగి పరీక్షల అనంతరం మందులు రాస్తున్న వైద్యులు